క్లుప్తంగా

రోబోటిక్ ఈవెంట్‌లో ప్రతిభ



నయని

ఖమ్మం సహకారనగర్: అమెరికాలోని చికాగో రాష్ట్రంలో ఈ నెల 19న జరిగిన రోబోటిక్ ఈవెంట్‌లో ఎస్ఆర్ఐ పేరంట్స్ అసోసియేషన్ జిల్లా మాజీ అధ్యక్షురాలు మేదరమెట్ల స్వరూపరాణి, పుల్లయ్య మనుమరాలు నయని ప్రతిభ కనబర్చి ద్వితీయ స్థానం సాధించింది. ఈ మేరకు పియూరియా మేయర్, ఇల్లీనైస్ రాష్ట్ర గవర్నర్లు సైతం అభినందించారని, 140 దేశాల నుండి వచ్చిన వారందరిలోనూ ప్రతిభ కనబర్చిందని పుల్లయ్య దంపతులు తెలిపారు.

నియామకం


నియామక పత్రం అందుకుంటున్న సత్యనారాయణ

నేలకొండపల్లి: ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నేలకొండపల్లికి చెందిన జెర్రిపోతుల సత్యనారాయణను నియమించారు. ఈ మేరకు ఆదివారం జిల్లా అధ్యక్షుడు మారగాని వెంకట్ చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.... సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి కనకరావు, కమటం రఘు, నేలకొండపల్లి మండల కార్యదర్శి కొమ్మూరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భోజనం, పండ్లు పంపిణీ


పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం యాచకులు, వృద్ధులతో పాటు దివ్యాంగులకు బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ చెరుకుపల్లి బాలు పండ్లు, భోజనం, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సిహెచ్.ప్రవళిక, పంది వేణు, కె.సైదులు, పడిశాల వీరస్వామి, సీతారాములు, కాశయ్య, చక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'పై నేడు అవగాహన

ఖమ్మంఅర్బన్: భూభారతి చట్టంపై ఖమ్మం అర్బన్ పరిధిలోని రైతులకు నేడు (సోమవారం) నగరంలోని గట్టయ్యసెంటర్‌లోని కొత్త మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో ఉన్న డీపీఆర్‌సీ భవనంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరగనున్న కార్యక్రమానికి రైతులు పాల్గొని అవగాహన కల్పించుకోవాలన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఓదెలా 2
వినోద	మ్యాడ్ స్క్వేర్
సాయిరాం	ఒక్కడు
ఆదిత్య	అర్జున్ s/o వైజయంతి
శ్రీనివాస	జాక్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	20	పాలకూర	4
పచ్చిమిర్చి	30		20
కాకర	40	చుక్కకూర	4
బీర	56		20
దొండ	16	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	76	గోంగూర	4
గోరుచిక్కుడు	36		20
క్యాబేజీ	20	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	30		20
ఆలుగడ్డ	26	కొత్తిమీర	1
చామగడ్డ	40		30
క్యారెట్	26	పుదీన	1
క్యాప్సికం	50		20
బీట్‌రూట్	20	-ఖమ్మం వ్యవసాయం	

చిక్కిపోతున్న చెరువులు!

కబ్జా కోరల్లో చెరువులు, కుంటలు

- మట్టితో పూడుస్తున్న ఆక్రమణదారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

కామేపల్లి: చెరువు, కుంటలను పరిరక్షించాలని ప్రభుత్వం చెబుతున్నా.. చెరువులు ఆక్రమణకు గురికాకుండా కాపాడాల్సిన సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాటి విస్తీర్ణం ఏడాది ఏడాదిగా పూర్తిగా తగ్గిపోతుంది. దీంతో నీటి నిల్వ సాంద్రత తగ్గిపోయి ఆయకట్టు రైతులకు పంట చివరి వరకు నీరు అందే పరిస్థితి లేకుండా పోయింది. మండలంలో 101 చెరువులు, కుంటలు ఉండగా అన్ని చెరువులు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లో పూడిక తీయడంతో చెరువులు జలకళను సంతరించుకున్నప్పటికీ చెరువులు, కుంటల ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోకపోవడంతో మండలంలో చెరువులు, కుంటల ఆక్రమణ విచ్చలవిడిగా సాగుతుంది. ప్రతీ ఏటా వేసవి సీజన్‌లో చెరువు శిఖం భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నా కూడా


కొండాయిగూడెం పెద్ద చెరువు శిఖంలో సాగు చేసిన వరి

ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నవి. చెరువు, కుంటల ఎగువ ప్రాంతాల్లో రైతులు శిఖం భూముల్లో చెరువు మట్టిని తోలుకుని ఆక్రమించుకుంటున్నారు. దీంతో చెరువు, కుంటల విస్తీర్ణం బాగా తగ్గిపోతుంది. అంతే కాక చాలా మంది చెరువులు, కుంటల్లోనే బావులు సైతం తీస్తున్నారంటే పరిస్థితి ఏలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా చెరువుల్లో ఆక్రమణలు నిలిచిపోవాలంటే జియో ట్యాగింగ్ చేసి హద్దులను నిర్ణయించి, చెరువు చుట్టూ ట్రెంచ్‌ను కొట్టి వాటిని కాపాడాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


చెరువులోనే బావి తీసి నీటి తరలింపునకు ఏర్పాటుచేసిన మోటార్లు

చెరువులన్నీ ఆక్రమణే

చెరువులు, కుంటలన్నింటినీ చుట్టూ ఉన్న వాళ్లు ఆక్రమణకు పాల్పడుతున్నారు. ప్రతీ ఏటా శిఖం భూముల్లో మట్టి తోలకాలు చేపట్టి చదును చేయడంతో చెరువుల విస్తీర్ణం తగ్గిపోతుంది. దీంతో ఆయకట్టు చివరికి నీరు అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు చెరువుల పరిరక్షణకు కృషి చేయాలి.

– దండగల దేవేందర్, పండితాపురం

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

త్వరలోనే చెరువులన్నింటినీ ట్యాగింగ్ చేసి చెరువు హద్దులను నిర్ణయిస్తామని, చెరువులు, కుంటలు ఆక్రమణలను గుర్తించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామం. చెరువు శిఖం భూముల్లో ఎలాంటి మట్టి తోలకాలు చేపట్టినా వెంటనే తమకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.

– శంకర్, ఇరిగేషన్ డీఈఈ, కామేపల్లి

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు

ఖమ్మం మామిళ్లగూడెం: తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదని బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్ పేర్లు రావడంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ మాజీ ఎంపీలు అంజన్ కుమార్, అద్దంకి దయాకర్‌ల తీరుకు నిరసనగా ఆదివారం బీజేపీ ఆధ్వర్యాన ర్యాలీగా వచ్చి పార్టీ శ్రేణులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేషనల్ హెరాల్డ్ కేసు అంశంపై తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు ప్రధాని మోదీపై విమర్శలు చేయడాన్ని ఆయన ఖండించారు. కాంగ్రెస్ మాజీ ఎంపీలు అంజన్ కుమార్ యాదవ్, అద్దంకి దయాకర్‌లు నరేంద్ర మోదీ గురించి చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో


రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

హైకోర్టు అడ్వకేట్ మానిక సుంకర, రాష్ట్ర కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌గౌడ్, నున్నా రవికుమార్, నంబూరి రామలింగేశ్వరరావు, విజయరాజు, వర్క్‌షాప్ కన్వీనర్ ఇవి.రమేష్, కో కన్వీనర్లు వీరవెల్లి రాజేష్ గుప్తా, కొలిపాక శ్రీదేవి, ఎస్‌కె.యాకూబ్ పాషా, పమ్మి అనిత తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పరీక్షలతో మానసిక స్థైర్యం



పరీక్ష పత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థుల మానసిక స్థైర్యాన్ని పెంపొందించేందుకు మోడల్ పరీక్షలు దోహదపడతాయని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నాయకులు బాగం హేమంతరావు అన్నారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మోడల్ నీట్, ఎంసెట్ పరీక్ష పత్రాలను ఖమ్మంలో బాగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోడల్ పరీక్షలు రాయడంతో విద్యార్థులకు పరీక్షలపై అవగాహన వస్తుందని, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గత 26 ఏళ్లుగా ఈ మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంఘ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ మాజీ జాతీయ ఉపాధ్యక్షుడు రావి శివరామకృష్ణ, డాక్టర్స్ అకాడమీ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శులు నాగులమీరా, శివ నాయక్, నాయకులు ఉస్మాన్, ప్రతాప్, రాకేష్, రోహిత్, రాహుల్, గోపి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై మున్సిపల్ ముట్టడికి సిద్ధం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగర పరిధిలో ఉన్న సమస్యలను గుర్తించేందుకు మే మొదటి వారంలో విస్తృతంగా సర్వేలు చేపడతామని, అనంతరం కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్ అన్నారు. ఖానాపురం హవేలీ సీపీఎం కార్యకర్తల సమావేశం ఆదివారం మండల కార్యదర్శి దొంగల తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సమస్యలను సేకరించి చైతన్యవంతమైన ఉద్యమానికి తెరలేపామన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పిన్నింటి రమ్య, రాజకీయ విద్యా విభాగం బాధ్యులు బోడపట్ల రవీందర్, స్టడీ సర్కిల్ కన్వీనర్ నల్లమల సత్యనారాయణ, నాయకులు గాలి వెంకటాద్రి, కత్తుల అమరావతి, జట్ల ఆనందరావు, గాలి అంజయ్య, సత్తెనపల్లి శ్రీను, నరేంద్ర, తాళ్లపూడి మంగమ్మ, ధనియాకుల నాగేశ్వరరావు, పారుపల్లి వనజ, బోడేపూడి వీరభద్రరావు, నారాయణరావు, సత్యం, మాచర్ల గోపాల్, వేదగిరి మురహరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

ఏపీ సీఎం జన్మదిన వేడుకలు

ఖమ్మంఅర్బన్: ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పాండురంగాపురం రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టీడీపీ కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరపాటి వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, గుత్తా సీతయ్య, వడ్డెం విజయ్, శ్రీనివాస్‌గౌడ్, నాగేశ్వరరావు, సత్యవతి, సవులం లావణ్య, శ్రీనివాస్, కృష్ణమాచారి, నారాయణ, సంపత్, తిగుళ్ల రమణ, పలసం వెంకటేశ్వర్లు, జగదీష్, సీతారామయ్య, టీవీ రాజు, వెంకటనరసయ్య, పుచ్చకాయల ఝాన్సీ, మాదేవి, భిక్షపతి, రామారావు, డీపీఎస్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ పాటల సీడీ ఆవిష్కరణ

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర మహాసభల సందర్భంగా రూపొందించిన పాటల సీడీని ఆదివారం ఖమ్మంలో సభల ఆహ్వాన సంఘం అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు, పాటల రచయిత విప్లవ కుమార్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, రైతు సంఘం రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల వేదిక కన్వీనర్ ఎం.సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ నెల 25, 26, 27 తేదీల్లో నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరగనున్న మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, టి.ప్రవీణ్, ఇతర సంఘాల నాయకులు బండి రమేష్, మెరుగు రమణ, సత్యనారాయణ, ప్రభాకర్, షేక్ బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ పర్యటన

రఘునాథపాలెం: మండలంలో ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా కోటపాడు గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకుడు షేక్ ఆరీఫ్ కుమార్తె రెహానా వివాహ వేడుకకు హాజరై ఆమెను ఆశీర్వదించారు. వివాహం అనంతరం స్థానిక నాయకులతో ముచ్చటించి స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతురావు, నాయకులు కొప్పుల చంద్రశేఖర్, భూక్యా బాలాజీ, కొంటేముక్కల నాగేశ్వరరావు, బాతుల సుధాకర్, అరివికట్ల సుధీర్, టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ఎస్‌కె.ఇమామ్ భాయ్, ఉమ్మినేని కృష్ణ తదితరులు ఉన్నారు.

కార్మికుల పనివేళలు మార్చాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఎండలకు కేఎంసీ కాంట్రాక్టు కార్మికులు విలవిల్లాడుతున్నారని, వారి పనివేళలు మార్చాలని టీయూసీఐ ఖమ్మం ఏరియా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో కిన్నెర నారాయణ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పనివేళలో ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు మార్పు చేయాలని కోరారు. మజ్జిగ ప్యాకెట్లు, టోపీలు ఏర్పాటు చేయాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఐదునెలలకు పైగా వేతనాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తుంటే అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ఈ సమావేశంలో కాంతయ్య ప్రసాదు, నాగరాజు, సంగమ్మ, శిరీష, కృష్ణమూర్తి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీనివాస్

ఉచిత కంటి వైద్యశిబిరం


కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

తిరుమలాయపాలెం: మండలంలోని ఎలువారిగూడెంలో ఖమ్మం ఎస్వీ ఐకేర్ అండ్ ఫ్యాకో(లేజర్) సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.విజయ్‌ప్రకాష్ కంటి సమస్యతో బాధపడుతున్న వారిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో ఆస్పత్రి మేనేజ్‌మెంటు సభ్యుడు దరిపల్లి ఉత్తేజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యపరీక్షలు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్టు మీనాక్షి కంటి హాస్పిటల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పార్కిల్స్ డే..


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులతో డైరెక్టర్లు నాగేంద్రకుమార్, నీలిమ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో శనివారం రాత్రి స్పార్కిల్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు కరస్పాండెంట్ ఆర్‌వి నాగేంద్రకుమార్, నీలిమలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఐ అసోసియేషన్ అధ్యక్షులు బయ్యన్న బాబు, మాంటిస్సోరి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ సుధాకర్, టూ టౌన్ సీఐ బాలకృష్ణ ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు


కామేపల్లి: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు


తిరుమలాయపాలెంలో..

ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో శనివారం రాత్రి నుంచే ప్రార్థనలు ప్రారంభించారు. ఏసుప్రభు పునరుజ్జీవం ప్రాముఖ్యత వివరించారు. ప్రభువు చెప్పిన శాంతి, సహనం, సహకార గుణాలతో జీవించాలని పాస్టర్లు తెలిపారు.

– కామేపల్లి/ తిరుమలాయపాలెం

అ'పూర్వ' ఆత్మీయ సమ్మేళనం


ఖమ్మంక్రైం: సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

ఖమ్మంక్రైం: నగరంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయం పదోతరగతి 1989–90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం వంకాయలపాటి వారి మామిడతోటలో ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకన్నారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకుని తమ కష్ట, సుఖాలను పంచుకున్నారు. ఇదిలా ఉండగా ఒకే రకమైన దుస్తులు వేసుకుని అలరించారు.

కూసుమంచి: పాలేరులోని క్రాంతి విద్యామందిర్ 2005–06 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వెంకన్నతో పాటు నాడు చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.


కూసుమంచిలో..

పెద్దాస్పత్రిలో ఎక్స్‌రే కష్టాలు..

- వేధిస్తున్న క్యాసెట్ల కొరత
- గంటల తరబడి వేచిచూడాల్సిందే..
- రోగులకు తప్పని తిప్పలు

ఖమ్మంవైద్యవిభాగం: దశాబ్దాలుగా వైద్య సేవలందజేస్తున్న పెద్దాస్పత్రిలో ఎక్స్‌రే మిషన్‌తో కష్టాలు ఎదురవుతున్నాయి. నిత్యం వందలాది మందికి సేవలు అందజేస్తున్న ఎక్స్‌రే మిషన్ తరచూ మరమ్మతులకు గురవుతూ సేవలకు అంతరాయం ఏర్పడుతుండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఎక్స్‌రే మిషన్‌తో స్కానింగ్ చేయాల్సిన క్యాసెట్లు కొరతతో రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు సంభవిస్తున్నాయి. ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి పలు జిల్లాల నుండి నిత్యం 1500 మంది వరకు రోగులు వైద్య సేవలకు వస్తుంటారు. ఓపీలో వైద్యుడి వద్ద చూపించుకున్న రోగుల్లో అవసరమైన వారికి, ప్రమాదాల్లో గాయపడిన వారికి ఎక్స్‌రే తీయాల్సి ఉంటుంది. ఈ మేరకు పెద్దాస్పత్రిలో ప్రతీ రోజు సుమారు 300


ఎక్స్‌రే గది వద్ద వేచి ఉన్న రోగులు

క్యాసెట్లు లేక ఇబ్బంది..

ఎక్స్‌రే తీయడానికి వినియోగించే క్యాసెట్స్ కొరత తీవ్రంగా ఉంది. సాధారణంగా ఒక్కో క్యాసెట్ విలువ ఒక్కొక్కటి రూ. 1లక్షలకు పైగా ఉంటుంది. అయితే ప్రస్తుతం ఎక్స్‌రే విభాగంలో రెండు క్యాసెట్లు మాత్రమే ఉన్నాయి. కనీసం 5, 6 క్యాసెట్లు ఉంటే రోగులకు వేగంగా ఎక్స్‌రే తీసే వీలుంటుంది. రోగికి ఎక్స్‌రే తీసిన తర్వాత ఆ క్యాసెట్‌ను పక్కనే ఉండే కంప్యూటర్ రూంకు తీసుకెళ్లి స్కానర్‌లో పెట్టి కంప్యూటర్‌లోకి అప్‌లోడ్ చేస్తారు. రోగి వివరాలతో ఎక్స్‌రే ఫిల్మ్ రిపోర్టును సంబంధిత వైద్యుని వాట్సప్‌కు పంపిస్తారు. ఎక్స్‌రే రిపోర్టు చూసి తీవ్రతను బట్టి రోగికి వైద్య సేవలు అందిస్తారు. అయితే క్యాసెట్ల కొరతతో ఒక్కో రోగికి ఎక్స్‌రే తీయటానికి చాలా సమయం పడుతుంది. ఎక్స్‌రే తీసిన తర్వాత క్యాసెట్‌ను తీసుకెళ్లి కంప్యూటర్‌లోకి అప్‌లోడ్ చేయించి, వైద్యుడి వాట్సాప్‌కు పంపిన తర్వాత, సంబంధిత రోగి రిపోర్టును డిలీట్ చేయటానికి చాలా సమయం తీసుకుంటుంది. మళ్లీ అదే క్యాసెట్‌ను ఇంకో రోగికి ఎక్స్‌రే తీయటానికి వినియోగిస్తారు. క్యాసెట్స్ సరిపడా లేకపోవటంతో ఎక్స్‌రే కోసం వచ్చే రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. దీనికి తోడు అత్యవసరమైన రోగులు మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఈ విషయంపై ఆసుపత్రి అధికారులను వివరణ కోరగా నిధుల కొరత వల్ల క్యాసెట్ల కొరత ఏర్పడిందన్నారు. త్వరలో క్యాసెట్స్ కొనుగోలు చేస్తామని, సమస్య తీరుతుందని వెల్లడించారు.


క్యాసెట్‌ను స్కానింగ్ మిషన్‌లో ఉంచి ఎక్స్‌రే రిపోర్టును అప్‌లోడ్ చేస్తున్న టెక్నీషియన్